RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
గురువారం , సెప్టెంబర్ 17, 2026

# 6వ బెటాలియన్‌లో యువ ఆపద మిత్ర శిక్షణ

**ప్రారంభించిన జిల్లా కలెక్టర్ అంకిత్**



**లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి)**
చాతకొండలోని 6వ బెటాలియన్‌లో టీజీఎస్‌డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో యువ ఆపద మిత్ర పథకం కింద 118 మంది వాలంటీర్లకు ఏడు రోజుల విపత్తు నిర్వహణ శిక్షణ బుధవారం ప్రారంభమైంది. బెటాలియన్ కమాండెంట్ పి.సి.వి. రమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాల సమయంలో ప్రజలకు తక్షణ సహాయం అందించేలా యువతను సిద్ధం చేయడమే పథకం ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు. విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రాథమిక సహాయం, రెస్క్యూ విధానాలపై శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. అనంతరం వాలంటీర్లకు శిక్షణ కిట్లను అందజేశారు. విపత్తుల సమయంలో అప్రమత్తంగా పనిచేసి ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించాలని కమాండెంట్ పి.సి.వి. రమణ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమాండెంట్లు ఎస్. శ్రీధర్ రాజా, బి. మరియదాసు, ఏ.వి. రమణయ్య, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, టీజీఎస్డీఆర్ఎఫ్ అధికారులు, శిక్షణ బృందం, వాలంటీర్లు పాల్గొన్నారు.

# సాయుధ పోరాట స్ఫూర్తితో కదులుదాం

**- సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సలిగంటి శ్రీనివాస్**



**కొత్తగూడెం, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి)**
తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని నేటి దోపిడీ విధానాలపై రాజీలేని ప్రజా ఉద్యమాలు నిర్మించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సలిగంటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల్లో భాగంగా బుధవారం సిపిఐ రామవరం బ్రాంచ్ ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక రామవరం సెంటర్లో నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. అంతకుముందు అమర వీరుల స్థూపం వద్ద ఘనంగా నివాళులర్పించి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి నిజాం నిరంకుశ పాలనను, భూస్వామ్య గడీల అరాచకాలను ఎదిరించి కమ్యూనిస్టుల నాయకత్వంలో పేద ప్రజలు సాగించిన వీరోచిత పోరాటం ప్రపంచ చరిత్రలోనే అపూర్వమైనదని కొనియాడారు. భూమి, భుక్తి, విముక్తి కోసం ప్రాణాలర్పించిన నాలుగు వేల మంది అమరుల ఆశయాల సాధనకు ప్రతి కార్యకర్త పునరంకితం కావాలన్నారు. నేటి పాలకులు ప్రజాసంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ పేద, మధ్యతరగతి ప్రజల హక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు. పాలకుల ప్రజావ్యతిరేక విధానాలను తిప్పి కొట్టేందుకు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలను ఏకం చేసి పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కంచర్ల జమలయ్య, జి వీరాస్వామి, ఎస్ కె ఫహీమ్ దాదా, జిల్లా సమితి సభ్యులు భూక్యా శ్రీనివాస్, నేరెళ్ల రమేష్, ఏరియా నాయకులు మర్రి గోపి, తూముల శ్రీనివాస్, మండల రాజేశ్వరరావు, పెయ్యల రంగారావు, నగేష్, సింగిరాల రమేష్, అంకూస్, కార్పొరేటర్ కూరపాటి సుధాకర్, సర్పంచ్ వాడే రాములు, మాటేటి గోపాల్, డబ్బేటి గురుమూర్తి, ఖయూమ్, బరిగెల భూపేష్, గుత్తుల శ్రీనివాస్, అల్లకొండ సాయిలు, సురేంనేని రామారావు, తొగరు నరేందర్, జలీల్, శంకర్, ఈశ్వరయ్య, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో మూడవ రోజు గణపతి పూజలు

**గౌతంపూర్ లో పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు**



**చుంచుపల్లి, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి)**
శ్రీ సిద్ధి విఘ్నేశ్వర స్వామివారి నవరాత్రుల సందర్భంగా గౌతంపూర్ 8 ఇంక్లైన్ కాలనీలో మూడవ రోజు భక్తులు గణపతి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గరిక పూజ నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. కాలనీ మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వాలీబాల్, బాస్కెట్‌బాల్‌తో క్రీడా సందడి

**- కొత్తగూడెం, సత్తుపల్లి ఏరియాల సంయుక్త ఆధ్వర్యంలో పోటీలు**



**కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి)**
క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయని పలువురు నాయకులు అన్నారు. 2026- 27 వార్షిక సంవత్సరానికి వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో బుధవారం ప్రకాశం స్టేడియంలో కొత్తగూడెం, సత్తుపల్లి ఏరియాల సంయుక్తంగా వాలీబాల్, బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొంటూ గెలుపోటములను సమానంగా స్వీకరించాలని నాయకులు సూచించారు. ప్రాంతీయ, కంపెనీ, కోల్‌ఇండియా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి ఏరియాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీవైపీఎం జి. హరీష్, ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు కత్తర్ల రాములు, ఐఎన్‌టీయూసీ వైస్‌ప్రెసిడెంట్ ఎం.డి. రజాక్, ఏఐటీయూసీ సత్తుపల్లి బ్రాంచ్ కార్యదర్శి సముద్రాల సుధాకర్, ఐఎన్‌టీయూసీ వైస్‌ప్రెసిడెంట్ కే. కోటేశ్వరరావు, స్పోర్ట్స్ కో--ఆర్డినేటర్ సందబోయిన శ్రీనివాస్, జనరల్ కెప్టెన్ రాజశేఖర్, యూనియన్ ప్రతినిధులు, క్రీడల కెప్టెన్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# గుర్తింపు సంఘం ఎన్నికల వరకు అన్ని కార్మిక సంఘాలను ఆహ్వానించాలి : సీఐటీయూ



**కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి)**
సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం కాలపరిమితి పూర్తయినందున, తదుపరి ఎన్నికలు నిర్వహించే వరకు అన్ని రిజిస్టర్డ్ కార్మిక సంఘాలకు సమాన హోదా కల్పించాలని సీఐటీయూ అనుబంధ సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మంద నరసింహారావు డిమాండ్ చేశారు. గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగే వరకు ఆ సంఘానికి సంబంధించిన చందా రికవరీలను తక్షణమే నిలిపివేయాలని ఆయన కోరారు. ఈ మేరకు బుధవారం సింగరేణి జీఎం పర్సనల్ అండ్ పీఎం కిరణ్‌కుమార్‌కు మంద నరసింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు విజయగిరి శ్రీనివాస్, వై. వెంకటేశ్వరరావు వినతిపత్రం అందజేశారు. గని, డిపార్ట్‌మెంట్ స్థాయి సేఫ్టీ కమిటీలు, మైన్స్ కమిటీలు తదితర సమావేశాలకు అన్ని కార్మిక సంఘాల ప్రతినిధులను ఆహ్వానించేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. 2023 డిసెంబర్ 27న జరిగిన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు రెండేళ్ల కాలపరిమితి పూర్తయిందని, వెంటనే ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలని నరసింహారావు డిమాండ్ చేశారు. కాలపరిమితి ముగిసిన గుర్తింపు సంఘం పేరుతో కార్మికుల వేతనాల నుంచి చందా రికవరీ చేయడం సమంజసం కాదని, ఎన్నికలు పూర్తయ్యే వరకు చందా రికవరీలను నిలిపివేయాలని స్పష్టం చేశారు.

# పాల్వంచ అయ్యప్పస్వామి దేవాలయంలో వేలంపాటలు

**పాల్గొన్న కొత్వాల**



**పాల్వంచ, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి)**
పాల్వంచ శ్రీ స్వామి అయ్యప్ప దేవాలయంలో అయ్యప్ప సీజన్ సందర్భంగా వివిధ దుకాణాల నిర్వహణకు వేలంపాటలు నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో పూజా సామాగ్రి దుకాణానికి రూ.2 లక్షలు, టీ కొట్టు నిర్వహణకు రూ.1 లక్షకు వేలం ఖరారైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం దేవాలయంలో ప్రతి బుధవారం నిర్వహించే అన్నదాన కార్యక్రమాన్ని కొత్వాల శ్రీనివాసరావు ప్రారంభించారు. భక్తులకు అన్నదానం చేయడం ఆధ్యాత్మిక సేవతో పాటు సామాజిక బాధ్యతకు ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్ సభ్యులు బందెల శ్రీనివాస్, మేడిద సంతోష్‌గౌడ్, మిరియాల కమలాకర్, కనగాల రాంబాబుతో పాటు భక్తులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక



**- అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చాలి: కలెక్టర్ దివాకర టీఎస్**

**- ప్రతి మండలంలో ఇసుక బజార్ ఏర్పాటుకు చర్యలు**



**ఖమ్మం, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి ఖమ్మం బ్యూరో):**
ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి లబ్ధి చేకూర్చాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, హౌజింగ్ అధికారులతో రెండో విడత లబ్ధిదారుల ఎంపికపై సమీక్ష నిర్వహించారు. ఇందిరమ్మ కమిటీల నుంచి వచ్చిన పేర్లను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హతలను ధ్రువీకరించిన అనంతరం మాత్రమే ఆన్‌లైన్ ఆమోదాలు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. గతంలో సర్వే, సాంకేతిక లోపాల వల్ల అర్హులు అనర్హుల జాబితాలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, తప్పిదాలు పునరావృతమైతే బాధ్యులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నిర్ణీత గడువులో 100 శాతం ఆన్‌లైన్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు.
ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుకను ముందుగానే అంచనా వేసి, ప్రతి మండలంలో ఇసుక బజార్ ఏర్పాటుకు స్థలాలను గుర్తించాలని తెలిపారు. ఉచిత ఇసుక లభ్యత ప్రాంతాలను రెవెన్యూ, నీటిపారుదల, అటవీ శాఖల సమన్వయంతో గుర్తించి, జిల్లాలో ఇసుక కొరత లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, పై. శ్రీనివాసరెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, శిక్షణ సహాయ కలెక్టర్ పారస్ కుమార్, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, హౌజింగ్ అధికారులు పాల్గొన్నారు.

# ఐకమత్యంతో పండుగలు జరుపుకోవాలి : సీఐ రాయల వెంకటేశ్వర్లు

**- శ్రీనగర్ శ్రీ లక్ష్మీ గణపతి మండపంలో నిత్య అన్నదానం**



**లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి)**
శ్రీనగర్ ఐదో వీధిలో ఏర్పాటు చేసిన శ్రీ లక్ష్మీ గణపతి మండపంలో బుధవారం లక్ష్మీదేవిపల్లి సీఐ రాయల వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిత్య అన్నదానాన్ని ప్రారంభించారు. నవరాత్రులు, నిమజ్జనం వరకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తూ అధికారులు సూచించిన నిబంధనలు పాటించాలని సూచించారు. యువత, మహిళలు, గ్రామ పెద్దలు ఐకమత్యంతో ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ అఖిల, ఉత్సవ కమిటీ చైర్మన్, మాజీ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు లగడపాటి రమేష్‌చంద్, వట్టికొండ పాపారావు, రామకృష్ణ, మురళి, చారి, ప్రవీణ్, కోడూరి శ్రీనివాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిర్బంధాలతో పోరాటాలను అడ్డుకోలేరు : సీఐటీయూ



**కొత్తగూడెం, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి)**
ప్రభుత్వ నిర్బంధాలతో కార్మిక ప్రజా పోరాటాలను అడ్డుకోలేరని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ.జె. రమేష్ అన్నారు. కార్మిక పోరాటాలపై ప్రభుత్వ నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ కొత్తగూడెం రైల్వే స్టేషన్ సెంటర్‌లో సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సామూహిక నిరాహార దీక్ష నిర్వహించారు. ఆశా, అంగన్‌వాడీ వర్కర్లను పర్మినెంట్ చేయడంతో పాటు ఆశా వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. దీక్షకు సీపీఎం, బీఆర్ఎస్, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఐఎఫ్‌టీయూ, ఐద్వా, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంఘాలు మద్దతు తెలిపాయి. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె. బ్రహ్మచారి, కోశాధికారి జి. పద్మ, సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సిరుల సింగరేణిని, కార్మికుల భవిష్యత్తును రక్షించాలి

**సింగరేణి తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక**

**కార్మికుల సమస్యలపై సమగ్ర సమీక్ష అవసరం**

**కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి : బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేష్‌రెడ్డి**




**కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి)**
సింగరేణి సంస్థ ఎదుర్కొంటున్న ఆర్థిక, కార్మిక, ఉద్యోగ, సంక్షేమ సమస్యలను ప్రభుత్వం, యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో దిగనున్న ఏనుగుల రాకేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కొత్తగూడెంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి తెలంగాణ సిరుల గని, నల్లబంగారం, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని రాకేష్‌రెడ్డి అన్నారు. తరతరాలుగా లక్షలాది కుటుంబాలకు జీవనాధారంగా ఉన్న సంస్థ తెలంగాణ ఆర్థిక, సామాజిక చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకుందన్నారు. తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కార్మికులు పోషించిన పాత్ర చారిత్రాత్మకమని పేర్కొన్నారు. వారసత్వ ఉద్యోగాలు, మెడికల్ బోర్డులు, పెండింగ్ బకాయిలు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం, యాజమాన్యం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని కోరారు. సంస్థకు రావాల్సిన బకాయిలు, అప్పులు, గత ఐదేళ్ల లాభనష్టాలు, కొత్త గనులకు చేసిన పెట్టుబడులపై పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. మెడికల్ బోర్డుల విషయంలో కార్మికులు, వారి కుటుంబాల్లో నెలకొన్న ఆందోళనలను తొలగించాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని అన్నారు. సీపీఎస్ స్థానంలో ఓపీఎస్ అమలు అంశంపై ఉద్యోగ సంఘాలతో చర్చించి స్పష్టమైన విధానం ప్రకటించాలని కోరారు. సింగరేణిలో అవకతవకలపై ఆరోపణలు వస్తే సమగ్ర విచారణ జరిపించాలని, ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు కార్మిక సంఘాలతో చర్చించి పారదర్శకంగా, చట్టబద్ధంగా ఉండాలని సూచించారు. సమావేశంలో కొత్తగూడెం మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ దామోదర్, పాల్వంచ పట్టణ అధ్యక్షుడు మంతపురి రాజుగౌడ్, యువ నాయకులు సుంకు బాపన అనుదీప్, టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ నాయకుడు కుసన్ వీరభద్రం, తుమ్మ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు ముత్యాల రాజేష్, సీనియర్ నాయకులు తోగరు రాజశేఖర్, రంగరాజు, సర్పంచ్‌లు రతన్‌నాయక్, శ్రీకాంత్‌నాయక్, జయరాం, మైనారిటీ నాయకులు మున్నీర్, శ్రీకాంత్, రమాకాంత్, భూపతి, జూపల్లి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# 350 కిలోల అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

**- ఇద్దరిపై కేసు నమోదు.. ఆటో సీజ్**



**టేకులపల్లి, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి)**
లక్ష్మీపురం గ్రామంలో బుధవారం పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో 350 కిలోల అక్రమ రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. తడికలపూడి వైపు నుంచి వస్తున్న ఆటోను తనిఖీ చేస్తుండగా డ్రైవర్ వెనక్కి తిప్పి పారిపోయేందుకు ప్రయత్నించడంతో పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. ఆటోలో బియ్యం గుర్తించారు. తడికలపూడి పరిసర ప్రాంతాల్లో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి కారేపల్లికి చెందిన వ్యక్తికి విక్రయిస్తున్నట్లు డ్రైవర్ విచారణలో వెల్లడించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఇద్దరిపై 6ఏ కేసు నమోదు చేసి, బియ్యంతో పాటు ఆటోను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. అక్రమ రవాణాను అడ్డుకున్న ఎస్సై తిరుపతి, ఏఎస్సై నరసింహారావు, పోలీస్ సిబ్బందిని సీఐ సత్యనారాయణ అభినందించారు.

# రీ-సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం: అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి



**ముదిగొండ, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి ఖమ్మం బ్యూరో):**
ప్రభుత్వం చేపడుతున్న భూ రీ-సర్వేను పకడ్బందీగా నిర్వహించి, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ముదిగొండ మండలం ఖానాపురం గ్రామంలో జరుగుతున్న రీ-సర్వే ప్రక్రియను ఆయన పరిశీలించారు. భూ హక్కుదారులు, సరిహద్దు రైతుల సమక్షంలో క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, రైతుల హక్కులకు ఎలాంటి నష్టం కలగకుండా ప్రతి అంశాన్ని పరిశీలించాలని సూచించారు. సర్వే అనంతరం భూ వివరాలను గ్రామ పంచాయతీ, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రకటించి, అభ్యంతరాలకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. అభ్యంతరాల పరిష్కారం అనంతరం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని పేర్కొన్నారు. రీ-సర్వే పూర్తయితే భూ వివాదాలు గణనీయంగా తగ్గి రైతులకు భద్రత కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ముదిగొండ తహసీల్దార్ రవి కుమార్, అధికారులు, రైతులు, భూ యజమానులు పాల్గొన్నారు.

# వైభవంగా రాష్ట్రీయ పోషణ్ మాస ఉత్సవాలు

## అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి
## సర్పంచ్ బోడా బాలు నాయక్



**టేకులపల్లి, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి):**
9వ రాష్ట్రీయ పోషణ్ మాసం సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో టేకులపల్లి మండలంలోని అంగన్‌వాడీ కేంద్రంలో "మన అంగన్‌వాడీ--మన బాధ్యత" కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి సర్పంచ్ బోడా బాలు నాయక్, సీడీపీఓ సరోజిని, సూపర్‌వైజర్ లక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బోడా బాలు నాయక్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పోషకాహారం, సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సరోజిని, లక్ష్మి మాట్లాడుతూ రక్తహీనత నివారణతో పాటు పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారం అవసరమని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఆహార పదార్థాలతో ఏర్పాటు చేసిన పౌష్టికాహార వంటకాల ప్రదర్శన ఆకట్టుకుంది. గర్భిణులు, బాలింతలకు ఐరన్ మాత్రలు, పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయుడు వెంకయ్య, పంచాయతీ సెక్రటరీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, గ్రామ నాయకులు, తల్లులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ కార్మికులకు ఊరట

## పెండింగ్ వేతనాల కోసం రూ.75 లక్షల గ్రాంట్ మంజూరు.. చెక్కు అందజేత



**కల్లూరు, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి):**
కల్లూరు మున్సిపాలిటీలో పెండింగ్‌లో ఉన్న కార్మికుల వేతనాల చెల్లింపునకు రూ.75 లక్షల ప్రత్యేక గ్రాంట్ మంజూరైంది. మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ ప్రత్యేక చొరవతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ దృష్టికి సమస్యను తీసుకెళ్లగా, వారి సహకారంతో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దీంతో అధికారులు స్పందించి రూ.75 లక్షల గ్రాంట్‌ను మంజూరు చేసి చెక్కును చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్‌కు అందజేశారు. వేతనాల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్‌కు చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో 16వ వార్డు కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు, పలువురు నాయకులు, మున్సిపల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ఉపాధ్యాయులకు శిక్షణ

## - కోటగిరి రంగారావు మెమోరియల్ టీచర్స్ డెవలప్‌మెంట్ సమ్మిట్ 2026



**తల్లాడ, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి):**
కేఎస్ఎం విద్యాసంస్థల వ్యవస్థాపకులు కోటగిరి రంగారావు 15వ వర్ధంతి సందర్భంగా బాలభారతి విద్యాలయంలో "టీచింగ్ టు ట్రాన్స్‌ఫార్మింగ్" నినాదంతో కోటగిరి రంగారావు మెమోరియల్ టీచర్స్ డెవలప్‌మెంట్ సమ్మిట్--2026ను బుధవారం నిర్వహించారు. సదస్సులో ఉపాధ్యాయులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైన్స్ ప్రయోగాలు, క్రియేటివిటీ, టీఎల్ఎం తదితర అంశాలపై నిపుణులు శిక్షణ, అవగాహన కల్పించారు. ఆధునిక సాంకేతికతను విద్యా బోధనలో వినియోగిస్తూ విద్యార్థుల్లో సృజనాత్మకత, పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించాలని సూచించారు. విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని బాలభారతి ప్రీమియర్ లీగ్ క్రీడా పోటీలను క్రీడాజ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా తల్లాడ మండల విద్యాధికారి దామోదర వరప్రసాద్‌ను కేఎస్ఎం విద్యాసంస్థల కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, డైరెక్టర్ కోటగిరి శ్రావణి, ప్రిన్సిపాల్ రామారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త దారా విష్ణు మోహన్ రావు, సీనియర్ జర్నలిస్ట్ దుగ్గిదేవర అజయ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# చలో భద్రాచలం ఐటీడీఏ ఆదివాసీ మార్చ్‌ను జయప్రదం చేయాలి



## - 21న పెద్దఎత్తున తరలిరావాలి: తుడుందెబ్బ పిలుపు

**చర్ల, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి):**
సెప్టెంబర్ 21న భద్రాచలంలో నిర్వహించనున్న చలో ఐటీడీఏ ఆదివాసీ మార్చ్‌ను జయప్రదం చేయాలని తుడుం దెబ్బ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం చర్లలో తుడుందెబ్బ కార్యాలయంలో కోమరం భీమ్ విగ్రహం ఎదుట మార్చ్ పోస్టర్, కరపత్రాలను చర్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం విడుదల చేశారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు వాసం ముసలయ్య మాట్లాడుతూ ఐటీడీఏలను బలోపేతం చేయడంతో పాటు ఆదివాసీల ఉద్యోగ వాటాను కాపాడాలని, పోలీస్ నియామకాల్లో ఆదివాసీ నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జీవో 109 ప్రకారం వాటా కల్పించాలని, ఏజెన్సీలో వడ్డీ వ్యాపారాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. మార్చ్‌కు ఆదివాసీలు, యువత, నిరుద్యోగులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వాల్లే శ్రీకాంత్, పూనెం వరప్రసాద్, తాటి రామకృష్ణ, పూనెం రవికిరణ్, కలం శ్రీనివాస్, సోడి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలి

## - మ్యాపింగ్ కాని, అనామిలిస్ ఓటర్ల ప్రక్రియ వేగవంతం చేయాలి: కలెక్టర్ దివాకర టీఎస్



**ఖమ్మం, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి ఖమ్మం బ్యూరో):**
ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కాని, అనామిలిస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసులు జారీ చేసి, డాక్యుమెంట్ల అప్‌లోడ్, హియరింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఖమ్మం పాత డీఆర్డీఏ కార్యాలయ ఆవరణలో జరుగుతున్న ఎస్ఐఆర్ హియరింగ్ ప్రక్రియను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. బీఎల్ఓలు యాప్‌లో ఓటర్ల వివరాల నమోదు, డాక్యుమెంట్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్, హియరింగ్‌కు హాజరైన ఓటర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్ణీత తేదీల్లో హియరింగ్‌కు హాజరై అవసరమైన పత్రాలు సమర్పించాలని సూచించారు. అవసరమైన వారికి కుల ధ్రువీకరణ పత్రాలు త్వరగా అందేలా ఇప్పటికే రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటు గల్లంతుకాకుండా పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందించేందుకు బీఎల్ఓలు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని, నోటీసులు, హియరింగ్, ఫారాల స్వీకరణ, అప్‌లోడింగ్ ప్రక్రియలను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, బీఎల్ఓలు, ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

# క్రైస్తవుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి

## - టీసీసీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బిషప్ మానుకొండ సుదర్శనం






**తల్లాడ, సెప్టెంబర్ 17 (తెలంగాణ వాణి):**
క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ (టీసీసీ) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బిషప్ మానుకొండ సుదర్శనం డిమాండ్ చేశారు. గురువారం తల్లాడ మండలం ఎన్టీఆర్ నగర్‌లో టీసీసీ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం మండల అధ్యక్షుడు కే.వి. ఇజ్రాయిల్ అధ్యక్షతన, జిల్లా అధ్యక్షుడు గుంటి బాబురావు ఆధ్వర్యంలో నిర్వహించారు. క్రైస్తవుల కోసం మూడు ఎకరాల శ్మశానవాటిక స్థలం కేటాయించాలని, క్రైస్తవ భవనం నిర్మించాలని, 50 ఏళ్లు దాటిన వారికి వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని, అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సుదర్శనం ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నిరీక్షణ రావు, రాష్ట్ర సెక్రటరీ ఏసుదాస్, జిల్లా కార్యదర్శి రాజరత్నం, నూతన అధ్యక్షుడు ప్రకాష్ రావు, సెక్రటరీ రావూరి కృష్ణ, మహిళా సోదరీమణులు, టీసీసీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డీసీసీ అధ్యక్షురాలిని మర్యాదపూర్వకంగా కలిసిన లక్కినేని శ్యామ్



**టేకులపల్లి, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి):**
టేకులపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన లక్కినేని శ్యామ్ బుధవారం కొత్తగూడెంలోని డీసీసీ కార్యాలయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవీ ప్రసన్నను మర్యాదపూర్వకంగా కలిశారు. మండల నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తోట దేవీ ప్రసన్న లక్కినేని శ్యామ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జల్లేరు వాగు హత్య కేసు నిందితుడి అరెస్ట్

## హత్యకు ఉపయోగించిన కత్తి స్వాధీనం



**టేకులపల్లి, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి):**
ఆళ్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని జల్లేరు వాగు వద్ద జరిగిన పూనెం నారాయణ (రామనారాయణ) హత్య కేసును పోలీసులు ఛేదించారు. సుద్దరేవు గ్రామానికి చెందిన కొమరం రామనాథం (59)ను అదుపులోకి తీసుకుని విచారించగా హత్యకు సంబంధించిన వివరాలు వెల్లడైనట్లు ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. మృతుడు నారాయణ కొంతకాలంగా రామనాథం ఇంటి వద్ద ఉంటూ వ్యవసాయ పనుల్లో సహాయపడేవాడు. ఈ నెల 11న మద్యం మత్తులో రామనాథం ఇంటి వద్ద గొడవపడి, కుటుంబ సభ్యులను చంపుతానని బెదిరించినట్లు తెలిపారు. దీంతో ఆగ్రహించిన రామనాథం జల్లేరు వాగు వద్దకు వెళ్లి నారాయణపై కత్తితో దాడి చేసినట్లు విచారణలో వెల్లడైందన్నారు. నిందితుడి సమాచారం మేరకు కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసును త్వరితగతిన ఛేదించిన టేకులపల్లి సీఐ బత్తుల సత్యనారాయణ, ఆళ్లపల్లి ఎస్ఐ సోమేశ్వర్, టేకులపల్లి ఎస్ఐ తిరుపతి, పోలీసు సిబ్బందిని డీఎస్పీ వెంకన్న బాబు అభినందించారు.

# ఘనంగా నాయీ బ్రాహ్మణ దినోత్సవ వేడుకలు

## - కులదైవం ధన్వంతరి స్వామికి ప్రత్యేక పూజలు





**తల్లాడ, సెప్టెంబర్ 16:**
తల్లాడ పట్టణంలో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నాయీ బ్రాహ్మణ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. నారాయణపురం నుంచి మేళతాళాలు, డీజే, కోలాటాలతో మహిళలు, యువకులు ర్యాలీగా తల్లాడ పట్టణంలో పర్యటించారు. అనంతరం కులదైవం ధన్వంతరి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షుడు నంద్యాల నరసింహారావు హాజరై నాయీ బ్రాహ్మణుల ఐక్యత, సంక్షేమం, సామాజిక అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సంప్రదాయ వృత్తి పరిరక్షణతో పాటు యువతకు ఆధునిక సెలూన్లు, బ్యూటీ పార్లర్లలో ఉచిత శిక్షణ, స్వయం ఉపాధి అవకాశాలు, సబ్సిడీ, తక్కువ వడ్డీ రుణాలు కల్పించాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు మునుగోటి వెంకటేశ్వర్లు, రావులపాటి వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు రాచమల్ల అబి, టౌన్ అధ్యక్షుడు రాసమల్ల పెద్దబ్బాయి, ఉపాధ్యక్షుడు రాసమల్ల అప్పారావు, ఉప్పెర్ల రామారావు, కార్యదర్శి రాసమల్ల శివ, కోశాధికారి కన్నెదేవర కృష్ణ, మిడికొండ వెంకటేశ్వర్లు, సోమనపల్లి సుబ్బారావు, మంచికంటి రామారావు, రాఘవ, మండల కార్యదర్శి కన్నెదేవర రామకృష్ణతో పాటు సంఘం నాయకులు, సభ్యులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ దవాఖానా నుంచి ప్రైవేట్‌కు 'రిఫరల్' ఆరోపణలు!

## అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రిపై ఫిర్యాదుల వెల్లువ
## గిరిజన గర్భిణీకి రూ.71 వేల బిల్లు.. బంగారం తాకట్టు పెట్టి చెల్లింపు
## సాధారణ కడుపునొప్పికీ రూ.50 వేల ఖర్చు అవుతుందనిఒత్తిడి చేశారన్న ఆరోపణలు
## సమగ్ర విచారణకు జిల్లా ఉన్నతాధికారుల జోక్యానికి డిమాండ్










**అశ్వారావుపేట, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి):**
ఏజెన్సీ ప్రాంతంలోని నిరుపేదలు, గిరిజనులకు ఉచిత వైద్యం అందించాల్సిన అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రి నుంచి సమీపంలోని దమ్మపేట ప్రైవేట్ ఆసుపత్రికి రోగులను మళ్లిస్తున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందుబాటులో ఉన్నప్పటికీ, కొందరు సిబ్బంది రోగులను ప్రైవేట్ ఆసుపత్రికి పంపుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**గర్భిణీని ప్రైవేట్‌కు పంపి.. రూ.71 వేల బిల్లు?**
రాచన్నగూడెం గ్రామానికి చెందిన ఓ గిరిజన గర్భిణీని ప్రసవం కోసం అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా, అక్కడి సిబ్బంది దమ్మపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లాలని సూచించినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. అక్కడ రూ.10 వేల అడ్వాన్స్ తీసుకుని, డిశ్చార్జి సమయంలో రూ.71 వేల బిల్లు విధించారని తెలిపారు. అంత మొత్తం చెల్లించే స్థోమత లేకపోవడంతో బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి రూ.42 వేలతో వ్యవహారం ముగించుకున్నామని బాధిత కుటుంబం వాపోయింది.

**గ్యాస్ నొప్పికీ రూ.50 వేల ఖర్చా?**
నందమూరినగర్‌కు చెందిన ఓ మహిళ స్వల్ప కడుపునొప్పితో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లగా, దమ్మపేట ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లాలని సిబ్బంది ఒత్తిడి చేసినట్లు ఆరోపించింది. అక్కడ రూ.50 వేల వరకు ఖర్చవుతుందని, మాట్లాడి రూ.30 వేలకే చేయిస్తామని చెప్పినట్లు తెలిపింది. అనుమానంతో మరో వైద్యుడిని సంప్రదించగా సాధారణ మందులతో సమస్య తగ్గుతుందని చెప్పడంతో ఆమె ప్రభుత్వ ఆసుపత్రికి తిరిగి వచ్చి సిబ్బందిని నిలదీసినట్లు పేర్కొంది.

**ఉన్నతాధికారుల విచారణకు డిమాండ్**
ఈ ఆరోపణలపై ఆసుపత్రి సూపరింటెండెంట్ రాధా రుక్మిణి దృష్టికి బాధితులు ఫిర్యాదులు తీసుకెళ్లినట్లు సమాచారం. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తొలుత హామీ ఇచ్చినప్పటికీ, అనంతరం తమ ఆసుపత్రి నుంచి ఎవరినీ రిఫర్ చేయలేదని, రోగులే స్వచ్ఛందంగా వెళ్లారని ఆమె పేర్కొన్నట్లు తెలిసింది. దీంతో ఆరోపణలపై మరింత స్పష్టత కోసం జిల్లా వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు స్వతంత్రంగా విచారణ చేపట్టాలని ప్రజలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నారు.
ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, ప్రైవేట్ ఆసుపత్రులకు జరుగుతున్న రిఫరల్స్‌పై సమగ్రంగా పరిశీలన చేయాలని స్థానికులు కోరుతున్నారు.

RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana



# ఓజోన్ పొర పరిరక్షణకు కృషి చేద్దాం

## వలస సుభాష్ చంద్రబోస్ రాష్ట్ర అధ్యక్షులు బాలల హక్కుల ప్రజా వేదిక

**హుస్నాబాద్ సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి ఆర్ సి)**
సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షులు వలస సుభాష్ చంద్రబోస్ విలేకరులకు ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ ప్రపంచ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం సందర్భంగా కాలుష్యాన్ని తగ్గించడమే నేటి ఏకైక పరిష్కారం ఓజోన్ పొర పరిరక్షణకు అందరం కృషి చేద్దామని ఆయన అన్నారు రాష్ట్రంలో బాల కార్మిక లేని సమాజ నిర్మాణానికి అందరం పాటు ఆయన పిలుపునిచ్చారు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలిద్దామని అన్నారు బాల్యవివాలు నిర్మూలనకు కంకణ బద్దులు అవుదామని అన్నారు.16 ఏళ్ల లోపు పిల్లలకు సెల్ ఫోన్ నిషేధం చేయాలని రాష్ట్ర శాసనసభలో చట్టాన్ని చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఏ రేవంత్ రెడ్డిని బాలల హక్కుల ప్రజావేదిక రాష్ట్ర కమిటీ నుండి విజ్ఞప్తి చేస్తున్నట్టు ఆయన తెలిపారు బాలల హక్కులు పకడిబందీగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని ఆయన కోరారు బాలల చే ఎవరైనా పని చేసినట్లయితే టోలి ఫ్రీ నెంబర్ 1098కు సమాచారం అందించాలని వారు తెలిపారు బాల్యం చాలా గొప్పదని అన్నారు విద్య ద్వారానే సమాజ అభివృద్ధికి దోహద పడుతుందని పేర్కొన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం అందరం కృషి చేద్దామని ఆయన పేర్కొన్నారు బాలల హక్కుల ప్రజావేదిక గత రెండు దశాబ్దాలుగా బాలల హక్కుల కోసం ఎంత గాను రాష్ట్రవ్యాప్తంగా కృషి చేస్తున్నట్టు ఆయన తెలిపారు సెప్టెంబర్ 20 నుండి రాష్ట్రవ్యాప్తంగా మా బాలల హక్కుల ప్రజా వేదిక ఆధ్వర్యంలో 16 ఏళ్లలో పిల్లలకు సెల్ ఫోను సామాజిక మధ్యమాలు నిషేదించాలని రాష్ట్ర శాసనసభలో చట్టం చేయాలని కోరుతూ అన్ని జిల్లా కేంద్రాలలో రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన ఈ సందర్భంగా తెలిపారు దానితోపాటు బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేసేందుకు అన్ని జిల్లా కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. బాల కార్మిక లేని సమాజం కోసం అన్ని వర్గాలప్రజలుముందడుగువేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బాల కార్మికులు లేని సమాజం ఏర్పాడాలంటే ముందు బాలకార్మిక వ్యవస్థ నియంత్రణజరగాలన్నారు. కానీ దురదృష్ట వసాత్తు ఈసంఖ్య పెరుగుతూనే ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దానికోసం విద్యా హక్కు చట్టాన్ని ను పూర్తి స్థాయి లో అమలు చేసినప్పుడే అని ఈవ్యవస్థనునిర్మూలించడానికిఆస్కారంవుంటుందన్నారు.బాల కార్మిక వ్యవస్థ నిర్ములనకు అన్నిప్రభుత్వ శాఖల సమన్వయంతో పనిచేయాలని ముఖ్యంగా ప్రజలు , స్వచ్ఛంద సంస్థ లుముందుకిరావాలన్నారు. అలాంటి వారిని గుర్తించి వసతి గృహాల్లో ప్రభుత్వ పాఠశాలలోచేర్పించాలన్నారు. అందుకు బాధ్యతగా ప్రతి పౌరుడు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం కంకణ బదులు కావాలని ఆయన పిలుపునిచ్చారు రాష్ట్రవ్యాప్తంగా బాలల హక్కుల ప్రజా వేదిక బాలల హక్కుల కోసం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం బాల్య వివాహ నిర్మూలన కోసం రెండు దశాబ్దాలుగా కృషి చేస్తున్నట్టు ఆయన తెలిపారు రాష్ట్ర ప్రభుత్వం వర్షాకాలం కాబట్టి వసతి గృహాలను విద్యార్థులకు దుప్పట్లు దోమతెరలు ప్రత్యేకమైన వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# ఘనంగా బార్బర్స్ డే వేడుకలు

## - జెండా ఆవిష్కరించిన జిల్లా అధ్యక్షుడు కడియాల సత్యనారాయణ



**జూలూరుపాడు, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి):**
బార్బర్స్ డే సందర్భంగా జూలూరుపాడు మండల కేంద్రంలో నాయి బ్రాహ్మణ సేవా సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ముఖ్యఅతిథిగా హాజరైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు కడియాల సత్యనారాయణ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు కుదురుపాక నిర్మల, జిల్లా నాయకులు కొల్లిపాక వెంకటేశ్వర్లు, జిల్లా యూత్ సహాయ కార్యదర్శి మార్కాపురి నరసింహారావు, డివిజన్ సహాయ కార్యదర్శి వల్లోజి రమేష్, వైరా నియోజకవర్గ ఇన్‌చార్జి మాడుగుల నాగరాజు, కో-కన్వీనర్ కడియాల పుల్లయ్య, మండల అధ్యక్షుడు కడియాల శ్రీను, కార్యదర్శి పెద్దవరపు కృష్ణార్జునరావు, ఉపాధ్యక్షులు మాడుగుల నరేష్ పాల్గొన్నారు. అలాగే శేషాద్రి రాములు, కడియాల మని, కుదురుపాక సీతారాములు, నాగేశ్వరరావు, బుచ్చిబాబు, దయాకర్, మధు, హరీష్, వల్లోజి నాగరాజు, లక్ష్మయ్య, మార్కాపురి రాంబాబు, కడియాల ఆనందరావు, కడియాల వెంకన్న, మాదాపూర్ సతీష్, ఉబ్బనపల్లి నరేష్, మార్కాపురి సురేష్, హరికృష్ణ, ఉప్పర్ల నరసింహారావు, కడియాల నరేష్, కడియాల కృష్ణ, రామవరపు కిరణ్, నీదికొండ నరసింహారావు, ప్రేమ్, లతీఫ్, సైదులు, సత్తిపండు, నాగేశ్వరరావు, కిషోర్, మహిళలు కడియాల లక్ష్మి, ఉమా, శ్రీలత, జీవిత తదితరులు పాల్గొన్నారు.

# ఎస్టీ కార్పొరేషన్ ఎక్కడ? బంజారా సమాజానికి మంత్రి పదవి ఎక్కడ?

## - బంజారాలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తే సహించేది లేదు

## - ప్రభుత్వం సమాధానం చెప్పాలి: బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కిషన్ బంజారా

**వనపర్తి, సెప్టెంబర్ 16:(తెలంగాణ వాణి ప్రతినిధి)**
తెలంగాణలో ఎస్టీ, ముఖ్యంగా బంజారా సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కిషన్ బంజారా డిమాండ్ చేశారు. బంజారా యువతకు ఆర్థిక స్వావలంబన కల్పించాల్సిన ఎస్టీ కార్పొరేషన్ పరిస్థితి ఏమిటని, అది ఎందుకు నిలిచిపోయిందని ఆయన ప్రశ్నించారు. ఎస్టీ కార్పొరేషన్ ద్వారా అందాల్సిన రుణాలు, సబ్సిడీలు, స్వయం ఉపాధి అవకాశాలు ఎందుకు అందడం లేదో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. "ఎస్టీ కార్పొరేషన్ మా హక్కు. అది ఎవరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడే విషయం కాదు. బంజారా యువత వ్యాపారాలు చేసుకోవాలి, స్వయం ఉపాధి పొందాలి, ఆర్థికంగా ఎదగాలి. అందుకోసం ప్రభుత్వం బలమైన ఆర్థిక సంస్థగా కార్పొరేషన్‌ను బలోపేతం చేయాలి. కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసి బంజారా యువతను నిరాశకు గురిచేయడం సరికాదు" అని కిషన్ బంజారా అన్నారు.

**బంజారా సమాజానికి మంత్రి పదవి ఎందుకు లేదు?**
తెలంగాణ రాజకీయాల్లో బంజారా సమాజానికి ఉన్న జనాభా, సామాజిక ప్రాధాన్యతకు అనుగుణంగా మంత్రివర్గంలో తగిన ప్రాతినిధ్యం ఎందుకు కల్పించడం లేదో రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని కిషన్ బంజారా డిమాండ్ చేశారు. "బంజారాలు కేవలం ఎన్నికల సమయంలో గుర్తుకొచ్చే ఓటర్లు కాదు. తెలంగాణ రాష్ట్ర నిర్మాణంలో భాగస్వాములైన సమాజం. మా సమస్యలను మంత్రివర్గంలో బలంగా వినిపించే స్థాయిలో బంజారా సమాజానికి రాజకీయ ప్రాతినిధ్యం ఎందుకు ఇవ్వడం లేదు?" అని ఆయన ప్రశ్నించారు. గిరిజన సంక్షేమానికి సంబంధించిన శాఖ ఉండటం మాత్రమే సరిపోదని, బంజారా సమాజానికి రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం, నిర్ణయాధికారంలో భాగస్వామ్యం కూడా అవసరమని ఆయన అన్నారు.

**బంజారా సేవా సంఘం ప్రధాన డిమాండ్లు**
ఎస్టీ కార్పొరేషన్‌ను పూర్తి స్థాయిలో పునరుద్ధరించాలి. ఎస్టీ యువతకు సబ్సిడీ రుణాలు, స్వయం ఉపాధి పథకాలను వెంటనే అమలు చేయాలి. పెండింగ్‌లో ఉన్న ఎస్టీ కార్పొరేషన్ దరఖాస్తులను పరిష్కరించాలి. బంజారా సమాజానికి మంత్రివర్గంలో తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి. బంజారా యువత, విద్యార్థులు, మహిళలు, నిరుద్యోగుల కోసం ప్రత్యేక



కార్యాచరణ ప్రణాళిక ప్రకటించాలి. బంజారా సమాజానికి సంబంధించిన సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక సమీక్ష నిర్వహించాలి.

**"హక్కుల విషయంలో రాజీ ఉండదు"**
"మాకు ఎవరి మీద వ్యక్తిగత వ్యతిరేకత లేదు. ప్రభుత్వం మం చి పని చేస్తే అభినందిస్తాం.. తప్పు జరిగితే ప్రశ్నిస్తాం. బంజారా సమాజ హక్కుల విషయంలో మాత్రం రాజీ ఉండదు. ఎస్టీ కార్పొరేషన్ కోసం, బంజారా సమాజానికి రాజకీయ ప్రాతినిధ్యం కోసం మా పోరాటం కొనసాగుతుంది" అని కిషన్ బంజారా స్పష్టం చేశారు.

**"పదవి కోసం కాదు.. బంజారా సమాజం గొంతుక కోసం!"**
"బంజారా సమాజానికి మంత్రి పదవి ఇవ్వడం దయ కాదు.. మా రాజకీయ ప్రాతినిధ్యానికి గౌరవం. ఎస్టీ కార్పొరేషన్‌ను బలోపేతం చేయడం ఉపకారం కాదు.. మా యువత భవిష్యత్తుకు అవసరం. ప్రభుత్వం వెంటనే స్పందించాలి."

# గణేష్ నిమజ్జనంలో విషాదం.. ప్రముఖుల సంతాపం

**పటాన్ చెరు, సెప్టెంబర్ 16, (తెలంగాణ వాణి)**
వినాయక నిమజ్జనంలో నీట మునిగి మృతి చెందిన ఆరుగురు విద్యార్థుల మృత దేహాలను స్థానిక నాయకులు ప్రాచీన్ గ్లోబల్ ఆసుపత్రిలో మృతదేహాలను సందర్శించారు. పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, పటాన్ చెరు నియోజకవర్గ ఇంచార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి, తాజా మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్‌లు వీరిలో ఉన్నారు. పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలో బుధవారం సాయంత్రం చోటుచేసుకున్న గణేష్ నిమజ్జన విషాద ఘటనపై పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే వారు ఇంద్రేశం రోడ్డులోని ప్రాచీన్ గ్లోబల్ ఆసుపత్రికి చేరుకుని, మరణించిన విద్యార్థుల మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. చిన్న కంజర్ల గ్రామంలోని శిరీష మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ (అనాథ ఆశ్రమం) కు చెందిన ఆరుగురు విద్యార్థులు. పెద్ద కంజర్ల గ్రామ శివారులోని నేరేడు చెరువులో గణనాథుని నిమజ్జనానికి వెళ్లారు. అక్కడ నీటి లోతుపై అవగాహన లేకపోవడం, చెరువులో ఉన్న లోతైన గుంత కారణంగా ఆరుగురు విద్యార్థులు నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. బాధిత ఆశ్రమ నిర్వాహకులను, తోటి విద్యార్థులను పరామర్శించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, మెట్టు కుమార్ యాదవ్ వారిని ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మృతి



చెందిన వారికి తమ పూర్తి మద్దతు ఉంటుందన్నారు. ఈ ఊహించని ఘోర ప్రమాదంలో ఆరుగురు యువ విద్యార్థులు మరణించడం అత్యంత బాధాకరమని, చనిపోయిన కుటుంబాలకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

అధికారులకు ఆదేశాలు: మృతదేహాలకు తదుపరి ప్రక్రియలను వేగంగా పూర్తి చేయాలని ఆసుపత్రి యాజమాన్యాన్ని, పోలీసు అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

మృతుల్లో ఐదుగురు పాలిటెక్నిక్ డిప్లొమా విద్యార్థులు కాగా, ఒకరు పదో తరగతి విద్యార్థి. నరసింహ రాజు (18), సుమంత్ (19), గణేష్ (20), ఉదయ్ కిరణ్ (21), శ్యామ్ కుమార్ (18), సిద్ధార్థ్ (16) ఈ ప్రమాదంలో మరణించారు.

RNI NO APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
గురువారం , సెప్టెంబర్ 17 , 2026

## విఘ్నాలు తొలగించి విజయాలు కలిగించు లంబోధరా!



**మణుగూరు, సూర్యోదయ వార్త :**
మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురంలో శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి పంచమ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొన సాగుతున్నాయి. అర్చకుల ఆధ్వర్యంలో దేవరకొండ నరసింహాచారి--లలిత దంపతులు, కనుకు రమేష్ -సంధ్య దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉండ్రాళ్ళు, పాయసం, పులి హోర, శెనగలను నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. బుధ వారం మహా అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నేడు లడ్డూ వేలంపాట అనంతరం జరిగే గణేష్ నిమజ్జనంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

# తాత వనమా వెంకటేశ్వరరావు బాటలో మనవరాలు

- రాజకీయ రంగప్రవేశానికి డాక్టర్ వనమా అలేఖ్య?
- కేసీఆర్ -కేటీఆర్ ఆశీస్సులతో బీఆర్ఎస్‌లోకి అడుగులు?
- కొత్తగూడెం రాజకీయాల్లో మళ్లీ వనమా కుటుంబ చర్చ

**కొత్తగూడెం, సూర్యోదయ వార్త :**
కొత్తగూడెం రాజకీయాల్లో వనమా కుటుంబానికి ఉన్న సుదీర్ఘ రాజకీయ అనుబంధాన్ని కొనసాగించేందుకు మరో తరం వారసురాలు తెరపైకి రానున్నారా? ప్రస్తుతం ఇదే అంశం కొత్తగూడెం నియోజకవర్గం లోనే కాక ఉమ్మడి ఖమ్మం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మనవరాలు డాక్టర్ వనమా అలేఖ్య రాజకీయ రంగప్రవేశంపై స్థానిక రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. బీఆర్ఎస్‌లో ఆమెకు రాజకీయ అరంగేట్రం కల్పించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయనే ప్రచారంతో ప్రస్తుతం రాజకీయ వేడిని పెంచేసింది.

వనమా వెంకటేశ్వరరావు సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో కొనసాగుతూ కొత్తగూడెం ప్రాంతంలో తనకంటూ ప్రత్యేక రాజకీయ ప్రస్థానాన్ని ఏర్పరుచుకున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ నుంచి కొత్తగూడెం అభ్యర్థిగా ఆయన బరిలో నిలిచారు. 2026లో కూడా ఆయన బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పార్టీ కార్యకర్తల సమావేశాల్లో పాల్గొంటు పార్టీ ఆదేశాల మేరకు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేస్తున్నారు.



### రాజకీయ వారసత్వానికి కొత్త ముఖం?

ఇదే నేపథ్యంలో డాక్టర్ అలేఖ్య రాజకీయ ప్రవేశంపై చర్చ మొదలైంది. వైద్య రంగం లో విద్యాభ్యాసం కొ నసాగించిన ఆమె ప్రజా సేవా కార్యక్రమాల ద్వారా రాజకీయాల్లోకి అడుగుపెట్టేందుకు రం గం సిద్ధం చేసుకు న్నారనే ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా యువత, మహిళలు, విద్య, వైద్య రంగాలకు సంబంధించిన అంశాలను ప్రధానంగా తీసుకుని ప్రజల్లోకి వెళ్లే అవకాశం ఉందనే చర్చ వినిపిస్తోంది.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆశీస్సులతో ఆమె రాజకీయ ప్రస్థానం ప్రారంభమవుతుందనే ప్రచారం పార్టీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది.

### కొత్తగూడెంలో మళ్లీ వనమా ఫ్యామిలీ ఫోకస్

కొత్తగూడెం రాజకీయాలు గతంలోనే వనమా- జలగం రాజకీయసమీకరణాలతోరాష్ట్రస్థాయిలోచర్చనీయాంశమ య్యాయి. 2018 ఎన్నికల అనంతరం వనమా వెంకటేశ్వర రావు బీఆర్ఎస్‌లో చేరడంతో ఈ రెండు రాజకీయ కుటుం బాలకు సంబంధించినపరిణామాలుమరింతఆసక్తిని రేకెత్తించాయి.

ప్రస్తుతం కొత్తగూడెం రాజకీయాల్లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యుడు ఎంపి వద్దిరాజు రవిచంద్ర తన పట్టు పెంచుకునేందుకు దృష్టి సారిస్తున్న సమయంలో వనమా కుటుంబం నుంచి కొత్త తరం నాయకత్వం తెరపైకి వస్తుందనే చర్చతో కొత్తగూడెం రాజకీయ వాతావరణం వేడెక్కినట్టయింది.



మహిళా నాయకత్వం, యువతకు ప్రాధాన్యం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని అలేఖ్యకు పార్టీ బాధ్యతలు అప్పగి స్తారనే విషయాన్ని పక్కన పెడితే, పార్టీ విస్తృత కార్యక్రమాల ద్వారా ఆమె ప్రజల్లోకి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టెందుకు ప్రత్యేక కార్యా చరణ రూపొందుతున్నట్టు తెలుస్తుంది.

### అధికారిక ప్రకటన కోసం ఎదురుచూపులు

అలేఖ్య రాజకీయ రంగప్రవేశం, బీఆర్ఎస్ లో చేరిక, ఆమెకు ఇవ్వ బోయే బాధ్యతలు, భవి ష్యత్ రాజకీయ కార్యాచర ణపై పార్టీ అధిష్ఠానం నుంచి అధికారిక ప్రకటన వెలువడితే దీనిపై పూర్తి స్పష్టత రానుంది.

తాత నిర్మించిన రాజకీయ పునాదులపై మనవరాలు అడుగులు వేస్తారా? వనమా కుటుంబ రాజకీయ వారసత్వానికి అలేఖ్య కొత్త అధ్యాయాన్ని జోడిస్తారా? అన్నది ఇప్పుడు కొత్తగూడెం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చగా మారింది.